
క్లుప్తంగా

సొసైటీ ప్రెసిడెంట్ల రాజీనామా



పోతిరెడ్డి నాగిరెడ్డి రాజీనామా పత్రం

కురిచేడు: మండలంలోని మూడు సొసైటీల ప్రెసిడెంట్లు గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. కురిచేడు సొసైటీ ప్రెసిడెంటు పోతిరెడ్డి నాగిరెడ్డి, నమశ్శివాయపురం సొసైటీ ప్రెసిడెంటు ఆరె శ్రీను, పడమరవీరాయపాలెం సొసైటీ ప్రెసిడెంటు మానం కోటయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నామినేటెడ్ పదవులన్నింటికీ రాజీనామా చేయిస్తున్నారు. అందులో భాగంగా తమ పదవులను స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

కుళాయిల ఏర్పాటుపై చర్చ

దర్శి: నగర పంచాయతీలో అత్యవసర సాధారణ సర్వసభ్య కౌన్సిల్ సమావేశం చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో నగర పంచాయతీలో చేయాల్సిన అభివృద్ధి పనులు గురించి చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహేష్ మాట్లాడుతూ రూ. 121 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాట్లు, శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు, గ్రంథాలయానికి శాశ్వత భవన నిర్మాణం, నగర పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణం, కురిచేడు రోడ్డులో నగరపంచాయతీకి శాశ్వత భవన నిర్మాణాలు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు నిర్మాణాలు వంటి విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ద్విచక్రవాహనం వేలం

యర్రగొండపాలెం: అక్రమ మద్యం రవాణా కేసులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 18వ తేదీన వేలం వేయనున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ పి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ వాహనం రూ. 14,300తో వేలం ప్రారంభం అవుతుందని, అదనంగా 12 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేలం ముగిసిన వెంటనే పూర్తి డబ్బులు చెల్లించి వాహనాన్ని స్వాధీనం చేసుకోవచ్చని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

ముండ్లమూరు: మండలంలోని రైతులకు 30 శాతం రాయితీపై కందులు, మినుములు, పెసలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ తెలిపారు.



ఎండీ ఫారూక్, మండల వ్యవసాయాధికారి

ఇటీవల రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం ప్రతి రైతు భరోసా కేంద్రంలో 30 శాతం రాయితీపై కందులు(ఎల్ఆర్‌జీ52), మినుములు, పెసలు అందుబాటులో ఉన్నందున కావాల్సిన రైతులు ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్న సిబ్బందిని సంప్రదించి తీసుకోవచ్చన్నారు. దీనితో పాటు భూసార పరీక్షలు చేసేందుకు మట్టి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. అవసరమైన రైతులు భూసార పరీక్షలు చేపించుకోవచ్చని చెప్పారు. ఖరీఫ్‌లో వరి సాగు చేసేందుకు బీపీటీ 5204, ఎన్ఎల్ఆర్ 33892 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన వారికి కేజీకి ఐదు రూపాయలు రాయితీపై ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

చీరాల టౌన్: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం సుబ్బారావు సూచించారు. గురువారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్‌ప్లాన్ రుణాల అన్నీ 100 శాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణం వాయిదాలు పూర్తి అయిన గ్రూపులకు అదనపు మొత్తంతో రుణం అందించాలన్నారు. వీఓఏలు పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బాధ్యతలు కేటాయించాలి



సూచనలు ఇస్తున్న డీఈఓ సుభద్ర



డీఈవో సుభద్రను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపట్నం: పాఠశాల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉంటూ ఉపాధ్యాయులకు తరగతుల వారీగా బాధ్యతలు ఇప్పటి నుంచే కేటాయిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని డీఈఓ డి.సుభద్ర తెలిపారు. గురువారం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఉన్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్ ఆవరణలో ఉన్న పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించి ఎంఈవోలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల నిర్వహణ పట్ల ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఎస్ఎంసీ మీటింగ్ నిర్వహించి తల్లిదండ్రుల సమక్షంలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. తరగతులు వారీగా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. వర్క్‌లోడ్ డివైడ్ చేసుకోవాలని ప్లాన్ఆఫ్‌యాక్షన్ తయారు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అత్యధిక విద్యార్థులున్న ఈ పాఠశాలను విద్యా పథంలో నడిపించే విధంగా చూడాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవికి సూచించారు. మూమెంట్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పట్ల సజావుగా నిర్వహించిన సుభద్రకు ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

24 మందికి షోకాజ్ నోటీసులు

- శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు..



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీచేస్తున్న కమిషనర్ జస్వంతరావు

ఒంగోలు: నగరంలో ఉదయం 5.30 గంటలకు విధులకు హాజరు కావాల్సిన శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు విధులకు గైర్హాజరు కావడంతో వారందరికీ షోకాజ్ నోటీసును నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు జారీ చేశారు. గురువారం ఉదయం ట్రంకు రోడ్డు, గుంటూరు రోడ్డు, పాత బైపాస్ రోడ్డు, ఫ్లైవోవర్ బ్రిడ్జి, సౌత్ బైపాస్ రోడ్డు, కొప్పోలు ప్రాంతాల్లో పారిశుధ్య పనిని ఆయన పర్యవేక్షించారు. టీషాపుల వద్ద డస్ట్ బిన్లు తప్పనిసరిగా ఉండాలని, వాటిని పారిశుధ్య వాహనాలకు అందజేయాలన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే అపరాధరుసుం విధిస్తామని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో చిల్లర, టోకు, వాణిజ్య వ్యాపార సంస్థల వారికి 120 మైక్రాన్స్ పైబడిన నాణ్యతగల ప్రత్యామ్నాయ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు మాత్రమే అనుమతి ఉందని, కనుక 12 మైక్రాన్స్‌లోపల నాణ్యత గల క్యారీ బ్యాగులను నిషేధించామన్నారు. కనుక అటువంటి నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను విక్రయించడం, నిల్వ ఉంచడం, తయారుచేసే షాపు యజమానులకు అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. రోడ్డుకు ఇరువైపులున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, మొక్కలు, మట్టి దిబ్బలు, డివైడర్లకు ఇరువైపులా ఉన్న మట్టి, ఇతర వ్యర్థాలను గ్యాంగ్ వర్కుచే శుభ్రం చేయాలన్నారు. మురుగు ప్రాంతాల్లో సున్నం, బ్లీచింగ్ కలిపి చల్లించాల్సిందిగా, మెయిన్ రోడ్డులో గల మురికి నీటి పారుదల కల్వర్టులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి వ్యర్థాలను ట్రాక్టర్లతో తీయించి ప్రజారోగ్యానికి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో సాయినాథునికి పల్లకి సేవ



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



పల్లకి సేవలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో, కర్నూల్ రోడ్డు శ్రీనగర్ కాలనీలోని సాయిబాబా మందిరంలో గురువారం అభిషేకాలు అర్చన పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రాతఃకాలములో అర్చక స్వాములు షిరిడి సాయి నాథునికి సుగంధ పరిమళ ద్రవ్యాలు పసుపు కుంకుమ గంధం విభూది చందనం పన్నీరు కొబ్బరినీళ్ళు తో అభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఉపాలయంగా ఉన్న దత్తాత్రేయ స్వామి వారికి ఉదయం ఎనిమిది గంటలకు పాలు పెరుగు తేనె చక్కెరతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పంచహారతులతో మంగళ హారతి నిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు బాబా వారికి దీప ధూప హారతులతో పల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో జరుగుతున్న విషయాలను గమనించాలి

- రూరల్ సీఐ అజయ్‌కుమార్



సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐ మహేష్

మద్దిపాడు: గ్రామాల్లో జరుగుతున్న అన్ని విషయాలను గమనిస్తూ పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఒంగోలు రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ మండలంలోని మహిళా సంరక్షణ కార్యదర్శులను ఆదేశించారు. వారితో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో గ్రామాల్లో వర్గపోరు జరిగే అవకాశాలు ఉన్నాయని, అక్కడక్కడా అటువంటి ఘటనలు నమోదవుతున్నాయని తెలిపారు. అందువలన మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో జరుగుతున్న విషయాలు తెలుసుకుని తక్షణమే ఎస్ఐకి సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఉద్రిక్తతలు సృష్టించే వారిని పోలీసుశాఖ ఎప్పుడో గుర్తించిందని, వారు కాకుండా మరెవరైనా అటువంటి ఉద్రిక్తతలు కలిగించే వారిపై దృష్టి ఉంచి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలపాల్సి ఉందన్నారు. గ్రామాల్లో ప్రశాంతతకు భంగం వాటిల్లే చర్యలు ఎవరు తీసుకున్నా శిక్షార్హులవుతారని, అటువంటి వారిని గుర్తించి సమాచారం ఎస్ఐకి అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.మహేష్, అన్ని గ్రామాల మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

మద్దిపాడు: మండలంలోని 7 ఉన్నత పాఠశాలలు, 3 ఎయిడెడ్ పాఠశాలలు, 42 మండల పరిషత్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల మొదటి రోజే 90 శాతం మేర పుస్తకాలు పంపిణీ చేశామని చెప్పారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నోట్ పుస్తకాలు కూడా పంపిణీ చేశామని తెలిపారు. గత సంవత్సరం నమోదైన విద్యార్థుల సంఖ్య 3,378 మందికి సరిపడా పుస్తకాలు వచ్చాయని, అదనంగా పాఠశాలలో చేరే విద్యార్థులను బట్టి మరోమారు పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి పాఠశాలలకు కేటాయించిన పుస్తకాలను వెంట తీసుకుని వెళ్లారన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఆర్పీలతో ఎంఈఓ శ్రీనివాసరావు

హైస్కూల్ ప్లస్‌గా సంతనూతలపాడు జెడ్పీ

చీమకుర్తి: హైస్కూల్ ప్లస్‌గా సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చిందని ఇన్‌చార్జి హెచ్ఎం ఉమామహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ ప్లస్‌గా ఏర్పాటయ్యాక ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఎలాంటి ఫీజులు లేకుండా అత్యున్నత సాంకేతిక విద్యాబోధనతో సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో విద్యాబోధన జరుగుతుందని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమామహేశ్వరి తెలిపారు.

నీట్ పరీక్ష అవకతవకలపై విచారణ జరపాలి



డిమాండ్ చేస్తున్న ఆర్ఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈదుపల్లి నాగరాజు

ఒంగోలు: నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని రెవెల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈదుపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అప్సర సర్కిల్ ప్రాంగణంలో ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్య అభ్యసించేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలు ఈనెల 4న విడుదలయ్యాయన్నారు. అయితే 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులు రావడం, వీరంతా మొదటి ర్యాంక్ పొందడం, వీరిలో ఏడుగురు ఒకే సెంటర్లోని విద్యార్థులు కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. జూన్ 14న విడుదల చేస్తామన్న ఫలితాలను పదిరోజుల ముందే అంటే దేశవ్యాప్తంగా ఎన్నికల ఫలితాల హడావిడిలో ఉన్న సమయంలో విడుదలచేయడం కూడా అనుమానాలకు కారణంగా నిలిచిందన్నారు. దీనిపై ఇప్పటికే దేశ వ్యాప్తంగా నీట్ రాసిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, తక్షణమే నీట్ పరీక్షలన నిర్వహించినటువంటి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సమగ్రవిచారణ సిట్టింగ్ జడ్జితో జరిపించాలని కోరారు. 24 లక్షల మంది మెడికల్ విద్యార్థుల భవిష్యత్తులను కాపాడాలని, మెడికల్ విద్యతో వ్యాపారాన్ని ఆపి జాతీయ స్థాయిలో నీట్ పరీక్షలు మరలా జరపాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈదుపల్లి నాగరాజు డిమాండ్ చేశారు.

ఒంటరి మహిళకు ఉపాధి

ఒంగోలు సెంట్రల్: కార్పెంటర్‌గా పనిచేస్తూ మృతి చెందిన వీరబ్రహ్మం కుటుంబానికి సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఆ కుటుంబానికి ఉపాధి కల్పించి భరోసా కల్పించారు. వీర బ్రహ్మం మూడు నెలల క్రితం ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు భార్య భవాని, ఇద్దరు పిల్లలున్నారు. ఇల్లు గడవలేని పరిస్థితి. విషయం తెలిసిన సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఎన్ఆర్ఐలు మింది శ్రీనివాసరావు, పవన్ మండువ సహకారంతో 32వేల విలువైన కర్రీస్ పాయింట్ ఏర్పాటు చేయించారు. అంజయ్య రోడ్‌లో దుర్గా కంటి హాస్పటల్ పక్కన ఏర్పాటు చేసిన కర్రీస్ పాయింట్‌ను గురువారం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీక్రిష్ణ ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ షహనాజ్, సెక్రటరీ సర్దార్ బాష, మహబూబ్, నేరెళ్ల శ్రీనివాసరావు, కోచూరి శ్రీదేవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కర్రీస్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హక్కుల సాధనకు పోరాటం తప్పనిసరి

ఒంగోలు: బాధ్యతలకు నిలబడి హక్కులు సాధించుకునేందుకు పోరాటా పంథా తప్పనిసరి అని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి, ఐఫియా కౌన్సిలర్ పీవీ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు . ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు జీవో నెంబర్ 117 ఉత్తర్వులను రద్దు చేయాలని, పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో రెండు మాధ్యమాలను కొనసాగించాలని, 2005కు ముందు మాదిరిగా ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీకి ముందే ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు బకాయిలున్న రూ. 25వేల కోట్లు విడుదల చేయాలని తెలిపారు. తల్లికి వందనం డబ్బులు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం

కొమరోలు: పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసి భూమిలో కలియదున్నితే నేల సారవంతం అవుతుందని వ్యవసాయశాఖాధికారి కె.రాజేశ్వరి తెలిపారు. కొమరోలులోని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆత్మ ఆధ్వర్యంలో ఫార్మర్ ఓరియంటెడ్ యాక్టివిటీ కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను ఇస్తున్నట్లు తెలిపారు. వీటిని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయంలో జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలు, ఏ రకంగా వాడుకోవాలో రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ అధికారులు వెంకట శేషమ్మ, శైలజరాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారి రాజశ్రీ

సరుకులు పంపిణీ

మార్కాపురం: పట్టణంలోని హోంగార్డు కాలనీలో గురువారం సేవాభారతి సంస్థ ఆధ్వర్యంలో 30 మంది పేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, చిన్నపిల్లలకు ఆడుకునే వస్తువులు అందించారు. సంస్థ తరపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని అందచేసినట్లు ఆ సంస్థ బచ్చు రామకృష్ణ, ఆనంద్ తెలిపారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలి



రైతులకు వ్యవసాయ కరదీపికలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

రాచర్ల: సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి ఏ.శైజలారాణి అన్నారు. మండల కేంద్రమైన రాచర్ల రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ప్రధాన పంటలు, వాటి సాగులోని సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగుచేసి పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నితే నేలలో సేంద్రీకర్బనం శాతం పెరుగుతుందని వివరించారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాలంటే తమ గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో దగ్గరకు వెళ్లి డిక్రిష్ యాప్‌లో రిజిష్టర్ చేసుకోవాలని తెలిపారు. అంతేకాక సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. అనంతరం వ్యవసాయ కరదీపికను రైతులకు పంపిణీ చేశారు. జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి శేషమ్మ, రాచర్ల వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్, రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

కొనకనమిట్ల: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓలు డాంగేషరీఫ్, నరసింహారావు తెలిపారు. గురువారం గొట్లగట్టు కేజీబీవీ, గొట్లగట్టు, కొనకనమిట్ల, మర్రిపాలెం, చినారికట్ల, పెదారికట్ల, రేగడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలకు అవసరమైన పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. 15 వేల పాఠ్యపుస్తకాలను 6 నుంచి 10వ తరగతి వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. 8, 9, 10వ తరగతులకు నూరు శాతం పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. 6, 7, 8వ తరగతులకు 50 శాతం పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. మిగిలినవి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్, నోటు పుస్తకాలు, బెల్ట్‌లు వచ్చాయన్నారు. బూట్లు, షాక్స్‌లు, యూనీఫామ్ దుస్తులు, ఇంగ్లీషు డిక్షనరీలు రావాల్సి ఉందని ఎంఈఓలు చెప్పారు. పాఠ్య పుస్తకాల పంపిణీలో సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఈఓ కార్యాలయంలో ఉన్న పాఠ్య పుస్తకాలు

మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ అభినందనలు

మార్కాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్‌కు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం అభినందించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి కౌంటింగ్ వరకు తన సిబ్బందితో కలిసి విధులు నిర్వహించినందుకుగాను ప్రశంసా పత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ గరుడ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న కమిషనర్ కిరణ్

ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీ

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ చేసేందుకు ఈ నెల 15న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ కె. పూర్ణ చంద్రరావు గురువారం తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి ఏడాదిలో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్‌లు ఈ నెల 15న నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నేరుగా 15న నేరుగా ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు.